ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
బుధవారం 19 ఫిబ్రవరి 2025



పెద్దపల్లి మార్కెట్‌లో క్వింటాల్ పత్తికి రూ. 6,858

పెద్దపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం పత్తి క్వింటాలుకు అత్యధికంగా 6,858 రూపాయల ధర పలికింది. అత్యల్పంగా 5,218 రూపాయలు, మోడల్ ధర 6,536 రూపాయలు పలికింది. మార్కెట్‌కు 202 మంది రైతులు 632 సంచుల్లో 739.2 క్వింటాళ్ల పత్తిని తీసుక వచ్చారు.

నాలాల మరమ్మతుకు చర్యలు చేపట్టండి



నాలాను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): శిథిలమైన నాలాలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని రామగుండం కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కార్పొరేషన్‌లోని 10, 38, 39 డివిజన్లలోని ఉపరితల కాలువలను పరిశీలించారు. జీడీకే 2ఇంక్లైన్ మోరీ వద్ద శిథిలమైన నాలాతో మురుగు నీరు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతుందని, నాలాను పునరుద్ధరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురి కాకుండా వరద నీటి కాలువల నిర్మాణానికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. డంప్ యార్డ్‌ను పరిశీలించి చెత్త పేరుకు పోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, చెత్తను తగలబెట్టకుండ డంప్ యార్డుకే తరలించాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఎస్ఈ శివానంద్, డీఈ జమీల్ ఉన్నారు.

కలెక్టరేట్‌కు సౌర వెలుగులు

- 200 కేవీప సామర్థ్యంతో ప్యానళ్ల ఏర్పాటు
- మొదలైన విద్యుత్ ఉత్పత్తి, గ్రిడ్‌కు అనుసంధానం
- నెలకు ఆదా కానున్న రూ. 3 లక్షల విద్యుత్ బిల్లు



కలెక్టర్ కార్యాలయం భవనంపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానళ్లు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన సముదాయానికి సోలార్ వెలుగులు ఏర్పాటు చేశారు. సుమారు 75 లక్షల రూపాయల వ్యయంతో 200 కేవీప (160 కిలో వాట్స్) విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేశారు. నెల రోజుల నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం కాగా, ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను పవర్ గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. దీంతో నెలకు 3 లక్షల రూపాయల వరకు విద్యుత్ బిల్లులు ఆదా కావడమే కాకుండా ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను కలెక్టరేట్‌కు వాడుకుంటు న్నారు. 2016లో నాటి ప్రభుత్వం చేపట్టిన జిల్లాల పునర్విభజనలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు కరీంనగర్, జగి త్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఏర్పాటైన కొత్త జిల్లాలకు కలెక్టరేట్ భవనాలను మూడు అంతస్తుల్లో నిర్మించారు. పెద్దపల్లి కలెక్టరేట్ భవనాన్ని రాజీవ్ రహదారి పక్కన పెద్ద కల్వలలో గల ఎస్సారెస్పీ క్యాంపు కార్యాలయం స్థలంలో నిర్మించారు. 2022 ఆగస్టు 29వ తేదీన అప్పటి ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రారంభించారు. ప్రభుత్వ కార్యాలయాలన్ని ఒకే చోట కేంద్రీకృతం కావ డంతో వివిధ పనుల కోసం జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలు ఒకే చోట పనులు జరిగేలా కార్యాలయాలను నిర్మించారు.



సోలార్ పవర్ మీటర్

● ఎన్టీపీసీ సహకారంతో సోలార్ విద్యుత్..

కలెక్టరేట్ భవనం పైన ఏర్పాటు చేసిన సోలార్ ఉత్పత్తి ప్యానళ్లను ఎన్టీపీసీ సహకారంతో ఏర్పాటు చేశారు. ఆ మేరకు సోలార్ పవర్ ప్యానళ్ల ఏర్పాటు కోసం కావాల్సిన నిధుల మంజూరు కోసం కలెక్టర్ రామగుండం ఎన్టీపీసీ అధికారులకు లేఖ రాయగా, ఎన్టీపీసీ యాజమాన్యం 75 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో జిల్లా ఎన్‌పీడీసీఎల్ అధికారులు భవనాలపైన ఇరువైపులా సోలార్ ప్యాన ళ్లను ఏర్పాటు చేశారు. ఒక పక్క 100 కేవీప ప్యానళ్ల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌కు కలెక్టరేట్‌కు, మరోపక్క 25 కేవీప చొప్పున నాలుగు ప్యానళ్ల సముదాయాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ కొన్ని కార్యాలయాలకు వినియోగించుకోనున్నారు. మొత్తం 200 కేవీప విద్యుత్ ఉత్పత్తి

మిగతా 8వ పేజీలో...

● నెలకు రూ. 3 లక్షల వరకు విద్యుత్ బిల్లు..

కలెక్టరేట్ భవనంలో గల కార్యాలయాలకు వినియోగిస్తున్న విద్యుత్‌కు నెలకు సగటున 3 లక్షల రూపాయల వరకు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తున్నది. ఈ భవనంలో ఏర్పాటు చేసిన ప్రతీ కార్యాలయానికి ఒక విద్యుత్ మీటర్‌ను అమర్చారు. తద్వారా వచ్చే విద్యుత్ బిల్లులను ఆ శాఖ నుంచే బిల్లు లు చెల్లిస్తున్నారు. రెవెన్యూ వింగ్, కలెక్టరేట్‌లో ఉండే బాత్‌రూములు, కాన్ఫరెన్స్ హాళ్లు, వీడియో కాన్ఫరెన్స్ హాల్, మీటింగ్ హాల్, కలెక్టర్, అదనపు కలెక్టర్ల చాంబర్ల మధ్యలో ఉండే లైట్లు గార్డెన్ లైట్లు, కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న లైట్లు, బోర్ మోటార్ల బిల్లు అంతా రెవెన్యూ విభాగం నుంచే చెల్లిస్తున్నారు. నెలకు సగటున ఈ బిల్లు లక్షా 75 వేలకు పైగా వస్తుండగా, వివిధ కార్యాలయాల బిల్లులతో కలిపి నెలకు 3 లక్షల రూపాయల వరకు బిల్లు వ స్తుండ డం గమనార్హం. ఈ బిల్లుల భారాన్ని తగ్గిం చుకు నేందుకు కలెక్టర్ కోయ శ్రీహర్ష భవనంపై సోలా ర్ ప్యానళ్లను ఏర్పాటు చేయించి తద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను సద్విని యోగం చేసుకోవాలని భావించారు.

యూరియా కొరత లేకుండా చూడండి

- ఓదెల మండలంలో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్



కొలనూర్ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

ఓదెల, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియాను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం కలెక్టర్ పర్యటించారు. ఓదెల, కొలనూర్, నాంసానిపల్లి, పొత్కపల్లి, ప్రాథమిక పాఠశాల, కస్తూర్బా గాంధీ హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రం, వ్యవసాయ సహకార సంఘం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మండల పరిషత్ కార్యాలయాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఎన్‌సీడీ సర్వే పూర్తి చేయాలని కోరారు. వైద్యశాఖ చేపట్టే ప్రతీ కార్యక్రమంపై ఆశ కార్యకర్తలు అవగాహన పెంచుకోవాలన్నారు. టీబీ లక్షణాలున్న వారందరికీ ఎక్స్‌రే తీయాలని, ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్ మహిళలను క్రమంగా మానిటర్ చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషక లోపం ఉన్న విద్యార్థుల ఎదు గుదలకు కృషి చేయాలని, పరీక్షలు నిర్వహించి, ఆసుపత్రికి పంపించాలని కోరారు. ఉన్నత పాఠశాలలో మంజూరైన పనులను త్వరగా ప్రారంభిం చాలని, నాంసానిపల్లి పాఠశాలలో వరదనీరు నిల్వ ఉండకుండా ప్లాట్‌ఫాం నిర్మించాలని సూచించారు. ఓదెల కస్తూర్బా గాంధీ హైస్కూల్లో రెండు అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని, పొత్కపల్లి ఉన్నత పాఠశాలలో డయాస్‌తోపాటు మరమ్మతు పనులను చేపట్టాలని సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. వేసవిలో తాగు నీటి కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, పొత్కపల్లి వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో యూరియా నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ జిల్లా కేంద్రం నుంచి తెప్పించుకోవాలన్నారు. అలాగే ఈ పాస్ యంత్రాల ద్వారా పారదర్శకంగా యూరియా విక్రయాలు జర గాలని కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్ సునీత, ఎంపీడీవో తిరుపతి, ఎంఈఓ రమేష్, ఏఈ జగదీష్, వైద్యులు సంజనేష్ కుమార్, సహబాజ్ ఖాన్, ప్రోగ్రాం అధికారి సుధాకర్, ఎంపిఓ షబ్బీర్‌అలీ పాల్గొన్నారు.

అందని 'దూర' విద్య...

- నిలిచిపోయిన ఎస్‌డీఎల్‌సీఈ అధ్యయన కేంద్రాల సేవలు
- ఉమ్మడి జిల్లాలో 21 కేంద్రాలు

6

స్కూల్ బస్సులో పరిమితికి మించి విద్యార్థులు

- నిలదీసిన తల్లిదండ్రులు

8

కోడ్ ముగిసిన తర్వాత అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలి

పెద్దపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల కోసం పదే పదే దరఖాస్తు చేసుకోవద్దని, ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత అర్హులైన వారందరికీ రేషన్ కార్డులను పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి అన్నారు. మంగళవారం ఆమె కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గతేడాది మార్చిలో వచ్చిన అత్యధిక విద్యుత్ డిమాండ్ 15,623 మెగావాట్లు ప్రస్తుతం ఫిబ్రవరిలోనే వస్తుందన్నారు. 17 వేల మెగావాట్ల పీక్ డిమాండ్ వచ్చినా సరఫరా చేసే విధంగా ఏర్పాట్లు జరిగాయని సీఎస్ తెలిపారు. వ్యవసాయం, గృహాలు, పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగాలని, అవసరమైన మేర విద్యుత్ అందుబాటులో ఉన్నందున ఎక్కడ లోటు రావడానికి వీలు లేదని సీఎస్ పేర్కొన్నారు.

సబ్‌స్టేషన్ల వారీగా విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులు పూర్తవుతున్నాయని సీఎస్ పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని, ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్లకు సూచించారు. మిషన్ భగీరథ, పట్టణాలలో అమృత్ కింద చేపట్టిన తాగునీటి స్కీం, ఇతర తాగు నీటి స్కీంలకు, ఆసుపత్రులకు, వ్యవసాయ ఫీడర్లకు నిరంతరాయంగా సరఫరా ఉండే విధంగా పర్యవేక్షించాలన్నారు. కలెక్టర్లు సబ్‌స్టేషన్లను తనిఖీ చేయాలన్నారు. వ్యవసాయ యోగ్యమైన భూమికి రైతుభరోసా పథకం అమలుకు ప్రభుత్వం నిర్ణయించిందని, ఇప్పటి వరకు 3 ఎకరాల వరకు రైతులకు ఎకరానికి 12 వేల రూపాయల చొప్పున అందిందని, 63 శాతం పట్టాదారులు సహాయం పొందారన్నారు.

రైతుభరోసా పోర్టల్‌లో మిగిలిన వ్యవసాయ భూముల నమోదు ప్రక్రియను కలెక్టర్లు 5 రోజులలో పూర్తి చేయాలన్నారు. రైతు భరోసా పై ఫిర్యాదులను పరిష్కరించేందుకు మండల వ్యవసాయ అధికారి వ్యవసాయ విస్తరణ అధికారి పరిధిలో గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని, రైతుల నుంచి వచ్చే ప్రతీ ఫిర్యాదును పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సీఎస్ పేర్కొన్నారు. యాసంగి పంటకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన ఎరువుల స్టాక్ ఉండే విధంగా కలెక్టర్ పర్యవేక్షించాలన్నారు. ఆన్‌అండ్‌ఆఫ్ విధానంలో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాపాలన అర్జీలు, గ్రామసభలలో వచ్చిన దరఖాస్తులు, మీసేవ కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి జారీ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో ఉన్న రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, తదితర విద్యాలయాలను నిరంతరం తనిఖీ చేయాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఎన్టీపీసీ ఉద్యోగులకు ఆధునిక నివాసాలు

- పూర్తయిన బీ టైపు టవర్లు
- జీఎంలకు విల్లా స్థాయిలో డి టైపు క్వార్టర్లు
- పాత ఏ, బీ టైపు క్వార్టర్ల తొలగింపునకు సిద్ధం



జ్యోతినగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : రామగుండం ఎన్టీపీసీ, తెలంగాణ ఎన్టీపీపీ ఉద్యోగుల కోసం యాజమాన్యం ఆధునిక నివాసాలను ఏర్పాటు చేస్తున్నది. మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్థ ఉద్యోగులు, అధికారులకు అన్ని హంగులతో క్వార్టర్లను నిర్మిస్తోంది. గతంలో జి, జి ప్లస్ 1 కాకుండా అపార్ట్‌మెంటు స్థాయిలో 5 అంతస్తుల టవర్లను నిర్మిస్తున్నారు. ఉద్యోగుల(వర్క్‌మెన్) కోసం బి టైపు క్వార్టర్లను మూడు బ్లాకుల్లో టవర్ల రూపంలో, అధికారులకు(ఎగ్జిక్యూటివ్) సి టైపు టవర్లను నిర్మిస్తున్నారు. ఈటవర్లు దాదాపు పూర్తయ్యాయి. వీటిలో 300 వందలకుపైగా క్వార్టర్లున్నాయి.



ఏఎం స్థాయి అధికారుల డి టైపు క్వార్టర్ల కాలనీ

● ప్రాజెక్టు హెచ్‌ఓపీ, జీఎంలకు డి టైప్ క్వార్టర్లు

రామగుండం ఎన్టీపీసీ హెడ్ ఆఫ్ ది ప్రాజెక్టు (హెచ్‌ఓపీ), జీఎంలకు పీటీఎస్‌లోని వేంకటేశ్వర ఆలయం ఎదురుగా ఆధునికంగా డి టైపు క్వార్టర్లను నిర్మించారు. ప్రాజెక్టు ముఖ్య అధికారి క్వార్టర్ గతంలో వీజీపీ గెస్ట్‌హౌజ్ పక్కన ఉండగా, ఇప్పుడు హెచ్‌ఓపీ క్వార్టర్‌ను కొత్త డి టైపు క్వార్టర్‌లోకి మార్చారు. అలాగే ప్రాజెక్టులో 10 మందికి పైగా వివిధ విభా గాలకు జీఎంలున్నారు. వారందరికి ఈ క్వార్టర్ల సము దాయంలో కేటాయించారు.

● పాత ఎ, బి టైపు క్వార్టర్ల తొలగింపు..

ప్రాజెక్టు మొదలైన కాలంలో నిర్మించిన ఎ, బి టైపు క్వార్టర్లను తొలగించేందుకు ఎన్టీపీసీ యాజమాన్యం రంగం సిద్ధం చేసింది. సుమారు 40 సంవత్సరాల క్రితం ఆ క్వార్టర్లను ఎన్టీపీసీ నిర్మించింది. ఏ1 బ్లాకు నుంచి ఏ8 వరకు ఉన్న అన్ని ఎ టైపు క్వార్టర్లను కూల్చివేయనున్నారు. అలాగే బి టైపు క్వార్టర్లలో కొన్ని బ్లాకులలో ఉన్న ఆయా క్వార్టర్లను కూల్చివేస్తారు. ఇప్పటికే ఆ క్వార్టర్లలో ఉంటున్న ఉద్యోగులను ఇతర క్వార్టర్లకు షిఫ్టు చేశారు. క్వార్టర్ల కూల్చివేతలకు సంబంధించి ఒక సంస్థ కాంట్రాక్టు దక్కించుకున్నట్లు సమాచారం. పీటీఎస్ ప్రధాన గేటు పక్కన ఉన్న ఈ క్వార్టర్లను తొలగించిన తరువాత ఆ స్థలంలో సోలార్ ప్రాజెక్టును నెలకొల్పేందుకు ఎన్టీపీసీ ప్రణాళికలు సిద్ధం చేసింది.

ఆధునిక ఆవాసాలు ఇవ్వడం హర్షణీయం



- బాబర్ సలీంపాషా, ఎన్టీపీసీ ఎన్‌బీసీ సభ్యుడు

ఎన్టీపీసీ ఉద్యోగులకు ఆధునిక ఆవాసాలు ఇవ్వడం మంచి పరిణామం. ప్రస్తుత ఆధునిక సమాజంలో సంస్థ సిబ్బంది జీవన ప్రమాణాలను పెంచేందుకు యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయం. 40 ఏళ్ల నాటి క్వార్టర్ల కాల పరిమితి ముగుస్తున్న సమయంలో వారికి కొత్త క్వార్టర్లు కేటాయించడం మంచిది. మిగిలిన పనులు పూర్తి చేసి త్వరగా ఉద్యోగులకు క్వార్టర్లు కేటాయించాలి.

నుమాయిష్‌లో సింగరేణి స్టాల్‌కు బహుమతి



బహుమతిని సీఎండీ బలరాంకు అందజేస్తున్న అధికారులు

గోదావరిఖని, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నాంపల్లిలో జరిగిన పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)లో సింగరేణి సేవా సమితి ఏర్పాటు చేసిన మహిళా శక్తి మార్కెట్, స్వయం ఉపాధి ఉత్పత్తుల స్టాల్‌కు ద్వితీయ బహుమతి లభించింది. సోమవారం సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. స్టాల్ డెకొరేషన్, వస్తు విక్రయాలు జరుగుతున్న తీరు, సందర్శకుల అభిప్రాయాలు తదితర అంశాలను పరిశీలించిన న్యాయ నిర్ణేతలు ఉత్తమ స్టాల్స్‌ను ఎంపిక చేసినట్లు సొసైటీ నిర్వాహకులు వెల్లడించారు. నుమాయిష్‌లో ప్రదానం చేసిన బహుమతిని ఈడీ (మార్కెటింగ్), జీఎం(కో ఆర్డినేషన్), సింగరేణి సేవా సమితి ఉపాధ్యక్షులు ఎస్‌డీ ఎం సుభానీ, పీఆర్ఓ, సేవా సమితి కో ఆర్డినేటింగ్ ఆఫీసర్ శ్రీకాంత్‌లు మంగళవారం సీఎండీ ఎన్ బలరాంకు అందజేశారు. సీఎండీ మాట్లాడుతూ సింగరేణి స్టాల్‌కు బహుమతి ద్వారా గుర్తింపు రావడం అభినందనీయమన్నారు. 45రోజుల పాటు సాగిన నుమాయిష్‌లో సింగరేణిలోని 10 ఏరియాలకు చెందిన మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. దాదాపు రూ.6లక్షలకు పైగా విలువ చేసే క్లాత్ బ్యాగులు, జూట్‌బ్యాగులు, మగ్గం ఉత్పత్తులను విక్రయించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



జీడీ నగర్‌లో ఉపాధిహామీ పనులు పరిశీలిస్తున్న డీఆర్‌డీవో

పాలకుర్తి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే పథకాలను ప్రతీ మహిళ సద్వినియోగం చేసుకొని పలు వ్యాపార రంగాల్లో రాణించాలని డీఆర్‌డీవో కాళిందిని అన్నారు. మంగళవారం రాణాపూర్ గోవర్ధనగిరి స్వశక్తి సంఘం సభ్యురాలు మేకల సుమిత్ర స్త్రీనిధి ద్వారా ఏర్పాటు చేసుకున్న యూనిట్లను పరిశీలించారు. గుంటూర్‌పల్లిలోని శ్రీసాయి గ్రామైఖ్య సంఘం వెంకటేశ్వర స్వశక్తి సంఘసభ్యురాలైన మెట్టు పార్వతీ మహిళా శక్తిలో భాగంగా బ్యాంకు లింకేజి ద్వారా ఏర్పాటు చేసిన పచ్చళ్ల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. జేడీనగర్‌లో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. వీపీఎం సదానందం,ఏపీవో కొమురయ్య, గ్రామైక్య సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి



పోస్టర్ విడుదల చేస్తున్న సీపీఐఎంఎల్ నాయకులు

జ్యోతినగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్ డిమాండ్ చేశారు. ఈనెల 20న న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మహా ధర్నా, ప్రదర్శనను విజయవంతం చేయాలని ఆయన కోరారు. మంగళవారం ఐఎఫ్‌టీయు కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. పేదలకు ఇళ్లు ఇవ్వాలని, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన విద్య, వైద్యం అందించాలని, అసంఘటితరంగ కార్మికులకు కనీస వేతనాలను చెల్లించాలన్నారు. హామీలు అమలు చేయకుంటే పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టంచేశారు. పార్టీ, దాని అనుబంధ సంఘాల నాయకులు పి.స్వామి, రాయమల్లు, ఓదెమ్మ, కనకమ్మ, రజిత, రామలక్ష్మి, లత, ప్రమీల, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణ కేసులో పోలీసుల కస్టడీకి నిందితులు


సోదాలు నిర్వహించి బయటకు వస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల భూ ఆక్రమణ కేసులో అరెస్టై కరీంనగర్ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న మొగ్దుంపూర్‌కు చెందిన బల్మూరి రమణారావు, గణేష్‌నగర్‌కు చెందిన దాసరి సంజీవరెడ్డి, క్రిస్టియన్ కాలనీకి చెందిన మహ్మద్ బషీర్‌ను కోర్టు ఆదేశాలతో మంగళవారం కరీంనగర్ వన్ టౌన్ సీఐ కోటేశ్వర్ పోలీసు కస్టడీకి తీసుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 వరకు నిందితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. సోదాల్లో కేసుకు సంబంధించిన పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్‌కు తీవ్రగాయాలు

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తుండగా మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన పిక్కల్ల కొమురయ్య ప్రైవేట్ ఎలక్ట్రిషియన్ సోమవారం రాత్రి తీవ్రంగా గాయపడ్డాడు. పంటలకు నీరందించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ పని చేయకపోవడంతో రైతులు కొమురయ్యను ఆశ్రయించారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులను విద్యుత్ ఉద్యోగులు చేయవలసి ఉండగా పెగడపల్లిలో ప్రైవేటుగా ఎలక్ట్రికల్ పనులు చేస్తున్న కొమురయ్య చేస్తున్నాడు. రైతులు కొమురయ్యను ఆశ్రయించడంతో పెగడపల్లి ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎల్‌సీ తీసుకున్నాడు. అయితే నాంసానిపల్లికి చెందిన ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా కాగా దానికి అతడు ఎల్‌సీ తీసుకోలేదు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో కొమురయ్యను కరీంనగర్‌కు అనంతరం అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం కొమురయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

గంజాయి సేవిస్తున్న నలుగురి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని బతుకమ్మ ఘాట్ వద్దగల మడేలయ్య దేవాలయం వద్ద బండకింద దాచుకొని గంజాయి తాగుతున్న నలుగురు యువకులను మంగళవారం అరెస్ట్ చేశామని టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని బీవై నగర్‌కు చెందిన అంకార్ ప్రణీత్(24), అంబేద్కర్‌నగర్‌కు చెందిన గొల్లపెల్లి కార్తికేయన్(19), ఆకునూరి శివాజీ(19), ఆకునూరి మనిదీప్(20) అనే నలుగురు యువకులు కరీంనగర్‌లోని బస్టాండ్‌లో ఓ వ్యక్తి వద్ద రూ. 10000లకు గంజాయి కొనుక్కొని సిరిసిల్ల బతుకమ్మ ఘాట్ వద్ద తాగుతుండగా పట్టుకున్నామని తెలిపారు. వీరి వద్ద 100గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. యువత గంజాయికి అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయితో తయారుచేసిన పదార్థాలను కొనుగోలుచేసినా, రవాణా చేసినా, అమ్మినా, తాగినా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

- ఇద్దరికి గాయాలు

కోనరావుపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మపల్లి గ్రామంలో మంగళవారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. నిమ్మపల్లి గ్రామానికి చెందిన మల్యాల సురేష్ ద్విచక్ర వాహనంపై లిఫ్ట్ అడిగి వెళ్తుండగా నిమ్మపల్లి గ్రామ శివారులో వైన్స్ దగ్గర ఎదురుగా వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న ఉన్న సురేష్‌కు కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. బైక్ నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. 108 అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం ఇద్దరినీ సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


గాయపడిన సురేష్

రవాణాశాఖ కార్యాలయంలో

వాహన యజమాని వీరంగం

- విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌కు గాయాలు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఓ వాహన యజమాని దాడిలో కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. మంగళవారం సిరిసిల్ల పట్టణంలో రవాణాశాఖ అధికారులు తనిఖీ చేస్తుండగా ఫైయాష్ ఓవర్‌లోడ్‌తో వెళుతున్న లారీని ఆపి కేసు నమోదుచేసి ఆర్టీసీ డిపోకు తరలించారు. ఈ విషయమై రవాణాశాఖ కార్యాలయానికి వచ్చిన వాహన యజమాని నాగరాజు ఎంవీఐతో వాగ్వాదానికి దిగాడు. కార్యాలయంలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేయడంతో విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. ఈ సంఘటనపై వెంటనే జిల్లా రవాణాశాఖ అధికారి లక్ష్మణ్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వాహన యజమానిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదుచేశారు. మరోవైపు తనపైనే దాడిచేశారని, డబ్బులు డిమాండ్ చేశారని వాహన యజమాని నాగరాజు ఆరోపించడం కొసమెరుపు.

అందని దూర విద్య

- నిలిచిపోయిన ఎస్‌డీఎల్‌సీఈ అధ్యయన కేంద్రాల సేవలు
- ఉమ్మడి జిల్లాలో 21 కేంద్రాలు
- మూడున్నరేళ్లుగా సాగని ఉన్నత చదువులు

యూజీసీ కొత్త నిబంధనలు


ఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రెండున్నర దశాబ్దాలుగా ఎంతో మంది పేద విద్యార్థులకు, మహిళలకు, చిన్నాచితక పార్ట్ టైమ్ జాబ్స్ చేసుకునే ఉద్యోగులకు ఉన్నత విద్య అందించిన కాకతీయ యూనివర్సిటీ ఎస్‌డీఎల్‌సీఈ దూరవిద్య కేంద్రం సేవలు దూరమయ్యాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సుమారు 21 ఎస్‌డీఎల్‌సీఈ అధ్యయన కేంద్రాల సేవలకు మూడేన్నరేళ్లుగా యూజీసీ నిబంధనలు అడ్డుకట్ట వేశాయి. దీంతో పేద వారికి ఉన్నత విద్య అందని ద్రాక్షలా మారడంతో పాటు ఆయా సెంటర్లలో పని చేస్తున్న దాదాపు 500మందికి పైగా కౌన్సిలర్లు, 21మంది సిబ్బంది ఉపాధి కోల్పోయారు.



యూజీసీ నిబంధనలతో పేదలకు ఉన్నత విద్య దూరం...

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) దేశవ్యాప్తంగా తీసుకొచ్చిన నిబంధనలలో భాగంగా యూనివర్సిటీ పరిధిలో ఉన్న కళాశాలల్లోనే డిస్టెన్స్ కోర్సులు నిర్వహించాలని జీవో తీసుకువచ్చింది. ఈ జీవోతో ఉన్నత విద్య అభ్యసించాలనే కల పేద విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. గతంలో కాకతీయ యూనివర్సిటీ ఉమ్మడి జిల్లాలలో వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్ పరిధిలో ఉన్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు శాతవాహన యూనివర్సిటీ వచ్చినప్పటికి డిస్టెన్స్ కోర్సులు కేయూ పరిధిలోనే కొనసాగాయి. ఈ క్రమంలో యూజీసీ తీసుకువచ్చిన నిబంధనలతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు అధ్యయన కేంద్రాలలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది.

దూరవిద్యతో ఉన్నతస్థాయిలో....

రామగుండం పారిశ్రామిక ప్రాంతంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలలో వివిధ కారణాలతో చదువు మధ్యలోనే ఆపేసిన వేల మంది విద్యార్థులకు కేయూ దూరవిద్య అధ్యయన కేంద్రం ద్వారా ఉన్నత విద్యకు దోహదపడింది. 26 ఏళ్లుగా గోదావరిఖని డిగ్రీ కళాశాలలో కేయూ దూర విద్య అధ్యయన కేంద్రం ద్వారా ఎంతో మంది విద్యార్థులు డిగ్రీలు పూర్తి చేసి ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు.

దూరంగా వెళ్లి విద్యనభ్యసించాలి

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉన్న స్టడీ సెంటర్లలో విద్యను అభ్యసించాలంటే ప్రస్తుతం 50 నుంచి 150 కిలోమీటర్ల దూరంలోని కేయూ పరిధిలో నడుస్తున్న ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ మూడు జిల్లాల్లోని దూర విద్య అధ్యయన కేంద్రాలకు వెళ్ళాల్సి వస్తుంది. పరీక్షలు కూడా దూరంగా ఉన్న స్టడీ సెంటర్లకు వెళ్ళి రాయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వ్యయప్రయాసలకోర్చి వెళ్లలేని పరిస్థితి ఉండటంతో ఉన్నత విద్యకు దూరమవుతున్నారు.

ఖని అధ్యయన కేంద్రంలోనే వేల మంది విద్యార్థులు...

గోదావరిఖని అధ్యయన కేంద్రంలోనే వేల మంది విద్యార్థులు అభ్యసించేవారు. మంచిర్యాల, చెన్నూర్‌తో పాటు గోదావరిఖని, యైటింక్లయిన్‌కాలనీ, రామగుండం, ఎన్‌టీపీసీ, ఉమ్మడి రామగుండం మండలంలోని విద్యార్థులు ఉన్నత విద్యను సుమారు 3వేల మంది పైగా విద్యార్థులు యేటా విద్యను అభ్యసించే వారు. అధ్యయన కేంద్రం లేకపోవడం చాలా మంది ఉన్నత విద్యకు దూరంగా ఉండాల్సి వస్తుంది.

శాతవాహనలో డిస్టెన్స్ ఇప్పట్లో కష్టమే...

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని శాతవాహన యూనివర్సిటీలో డిస్టెన్స్ విద్య ప్రారంభం కావడానికి ఇప్పట్లో అవకాశం లేదు. దీంతో పాత పద్ధతిలో కొనసాగిన కాకతీయ యూనివర్సిటీ ఎస్‌డీఎల్‌సీఈ అధ్యయన కేంద్రాలను కొనసాగించాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. ఈ విషయంలో మూడున్నరేళ్ళుగా అధ్యయన కేంద్రాలను కొనసాగించాలని కౌన్సిలర్లు, విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, పలు స్వచ్ఛంద సంఘాలు డిమాండ్ చేయడంతో పాటు ఎమ్మెల్యేలకు, ఎంపీలకు, అధికారులకు విజ్ఞప్తులు చేస్తున్నారు.

అనుమతి వస్తే కొనసాగించేందుకు అవకాశం


రామచందర్, రిజిస్ట్రార్, కాకతీయ యూనివర్సిటీ



యూనివర్సిటీ పరిధిలోనే డిస్టెన్స్ కోర్సులను కొనసాగించాలని యూజీసీ స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని దూరవిద్య కేంద్రాలను నిలిపివేశాం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో శాతవాహన యూనివర్సిటీ పరిధిలో డిస్టెన్స్ కోర్సులు లేనందున ఉన్నత విద్యామండలి, యూజీసీ నుంచి ప్రత్యేక అనుమతులు వస్తే కొనసాగించడానికి అవకాశం ఉంటుంది.

అధ్యయన కేంద్రాన్ని కొనసాగేందుకు కృషి

రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, ఎమ్మెల్యే, రామగుండం



దూరవిద్య కేంద్రం సేవలు నిలిచిపోవడం వల్ల పేద విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం నా దృష్టికి రాగానే కెయూ ఎస్‌డీఎల్‌సీఈ అధ్యయన కేంద్రాన్ని తిరిగి పాతపద్ధతిలోనే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఉన్నత విద్యామండలి ప్రిన్సిపల్ సెక్రెటరీ, ప్రభుత్వానికి అప్పీల్ చేశాను. దూరవిద్యా కేంద్రాన్ని కొనసాగేలా కృషి చేస్తాను.

ఎంఈడీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నవంబరు 2024లో నిర్వహించిన ఎంఈడీ ఫలితాలను విడుదల చేసినట్టు యూనివర్సిటీ పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈడీ రెండో సెమిస్టర్, నాలుగో సెమిస్టర్ ఫలితాలు యూనివర్సిటీ వెబ్ సైట్లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నా రు. మరిన్ని వివరాల కోసం www.satavahana.ac.in సంప్రదించాలని సూచించారు.

ఎల్ఎల్‌బీ పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని మూడు సంవత్సరాల ఎల్ఎల్‌బీ పరీక్షల ప్రణాళికను విడుదల చేసినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీ నుంచి మార్చి 5వ తేదీ వరకు మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో లేదా ఆయా కళాశాలల్లో సంప్రదించాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న చోటు చేసుకున్న గొడవకు సంబంధించి వావిలాలపల్లికి చెందిన ఆవుల మధుకర్, రజిత, సుధాకర్‌పై త్రీటౌన్ పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఆవుల మధుకర్, రజిత, సుధాకర్ కులం పేరుతో దూషించారని బాధితుడు సందెబోయిన రాకేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వివాదాస్పదమవుతున్న విగ్రహాల తొలగింపు

- అటవీశాఖ అధికారులకు, గ్రామస్థులకు మధ్య వాగ్వాదం


అటవీశాఖ అధికారులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్థులు

వీర్నపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో అటవీశాఖ అధికారులకు, అక్కడి ప్రజలకు విగ్రహాల తొలగింపు అంశం వివాదాస్పదమవుతోంది. బంజేరు గ్రామంలో సోమవారం సేవాలాల్ మహారాజ్ రాళ్ల విగ్రహాన్ని తొలగించి పందిరిని ధ్వంసం చేసిన అటవీశాఖ అధికారులపై మండిపడుతూ మంగళవా రం గిరిజనులు రాళ్లతో విగ్రహాన్ని ఏర్పాటు చేసి పందిరి వేశారు. అక్కడికి చేరుకున్న అటవీశాఖ రేంజ్ అధికారి హరిప్రసాద్, సెక్షన్ అధికారి భూలక్ష్మి, బీట్ అధికారి కిరణ్‌తో గిరిజనులు వాగ్వాదానికి దిగారు. ఏడాది నుంచి ఉన్న సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ఎఫ్ఆర్‌వో మాట్లాడుతూ అటవీ భూమిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అటవీ భూములను ఎవరూ ఆక్రమించవద్దని గిరిజనులకు సూచించారు. గర్జనపల్లి గ్రామంలోని నీలగిరి తోట అటవీ ప్రాంతంలో ఎల్లమ్మ తల్లి విగ్రహం వెలిసిందంటూ గ్రామస్థులు మంగళవారం పూజలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు, గర్జనపల్లి ఎఫ్ఎస్‌వో ఆయూబ్‌ఖాన్, బీట్ అధికారులు వేణు, లావణ్య, పోలీసులు అక్కడికి చేరుకొని అటవీప్రాంతంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయరాదన్నారు. అక్కడే పూజలు చేస్తున్న మహిళలను పోలీసులు అక్కడినుంచి పంపించేశారు. అటవీ భూమిని కబ్జా చేసే ప్రయత్నం చేయొద్దని వారికి సూచించారు. కొద్దిసేపు అటవీశాఖ అధికారులకు, గ్రామస్థులకు మధ్య వాగ్వాదం జరిగింది. వెలిసిన విగ్రహాన్ని ఎవరు తొలగించినా ఊరుకోబోమని గ్రామస్థులు హెచ్చరించారు. రెండు గ్రామాల్లో అటవీశాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు.

లంబాడిపల్లిలో హైనా దాడి.. గేదె, దూడ మృతి

చిగురుమామిడి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబాడిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి ఆది శ్రీకాంత్ అనే రైతుకు చెందిన గేదె, దూడ మృతి చెందాయి. బాధిత రైతు మాట్లాడుతు తన కొట్టం వద్ద గేదె, దూడను కట్టి వేసి ఇంటికి వెళ్లనన్నాడు. మంగళవా రం ఉదయం వచ్చే సరికి గేదె, దూడలు మృతి చెంది ఉన్నాయని వాటిపై హైనా దాడి చేసిన గుర్తులు ఉన్నాయని తెలిపాడు. పాడి గేదె విలువ దాదాపు 90 వేలు, దూడ విలువ 9 వేల వరకు ఉంటుందన్నారు. దీనిపై రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. అటవీశాఖ అధికారులు స్పందించి సహాయం అందించాలని వేడుకున్నాడు.

ఇసుక డంప్ సీజ్

తంగళ్లపల్లి, (సిరిసిల్ల రూరల్) ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలంలోని కస్బెకట్కూర్ శివారులో అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంప్‌లను మంగళవారం పోలీస్, రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి రాత్రిపూట స్మగ్లర్లు ఇసుకను అక్రమ రవాణా చేసి గ్రామశివారులో డంప్ చేశారని ఫిర్యాదులు వచ్చాయి. స్పందించిన తహసీల్దార్ జయంత్‌కుమార్ సిబ్బంది, పోలీసులతో కలిసి కస్బెకట్కూర్ శివారులో ఇసుక డంప్‌ను పరిశీలించి సీజ్ చేశారు.

ఆలయ మెట్లను ధ్వంసం చేసిన ముగ్గురిపై కేసు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుమాల గ్రామశివారు మడలేశ్వరస్వామి ఆలయమెట్లను ధ్వంసం చేసిన సంఘటనలో అదే గ్రామానికి చెందిన రామిండ్ల దేవదానం, అరేటి సంతు, అరేటి ఎల్లయ్యపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. గ్రామంలో గ్రామపంచాయతీతో పాటు అన్ని కుల సంఘాల తీర్మానం మేరకు 2019లో ఆలయ నిర్మాణానికి 14 గుంటల స్థలాన్ని కేటాయించారని పేర్కొన్నారు. ఆ స్థలంలో రజక సంఘం సభ్యులు మడలేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారని చెప్పారు. కొంత కాలంగా దేవదానం, సంతు, ఎల్లయ్యలు ఆ స్థలం తమకు చెందినదని పేర్కొంటూ తరచు గొడవకు దిగుతుండడంతో పాటు ఈనెల 18న గుడి మెట్లను ధ్వంసం చేశారని పేర్కొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ధర్మారం సతీష్ ఫిర్యాదుతో దేవదానం, సంతు, ఎల్లయ్యపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఐదు దశాబ్దాల ఉద్యమ ప్రస్థానం..

- ఈనెల 20, 21 తేదీల్లో ఆర్ఎస్‌యూ పూర్వ విద్యార్థుల సభలు



పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాడికల్స్ అనే పదం ఐదు దశాబ్దాల క్రితం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రతీ ఊరిలో వినిపించిన మాట. ఐదు దశాబ్దాల క్రితం పురుడు పోసుకున్న రాడికల్ విద్యార్థి సంఘం(ఆర్ఎస్‌యూ) ప్రభావంతో ఉమ్మడి జిల్లాకు చెందిన అనేక మంది ఆ సంస్థ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. విద్యను వదిలేసి ప్రజలను చైతన్యవంతుల్ని చేసేందుకు మావోయిస్టు పార్టీ(నాటి పీపుల్స్‌వార్)లో చేరి గ్రామాల బాట పట్టారు. పనిచేస్తున్నది పీపుల్స్‌వార్ పార్టీలో అయినా దాని అనుబంధ సంస్థ ఆర్ఎస్‌యూ కార్యకర్తలుగానే గుర్తింపు పొందారు. పీపుల్స్‌వార్ పోరాటాలు ఐదు దశాబ్దాలుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎన్నో జ్ఞాపకాలను, గాయాలను మిగిల్చింది. యాభై ఏళ్ల క్రితం పురుడు పోసుకున్న ఆర్ఎస్‌యూ (రాడికల్ స్టూడెంట్ యూనియన్)లో ఉమ్మడి జిల్లా నుంచి ఎంతో మంది క్రియాశీల సభ్యులుగా పనిచేశారు. అనంతరం వారి పోరాటంలో భాగంగా మావోయిస్టులో చేరారు. విద్యాలయాల నుంచి పల్లెలకు, ప్రభుత్వం నుంచి నిర్బంధం పెరగడంతో అజ్ఞాతంలోకి వెళ్లి అడవి బాట పట్టారు. ఉమ్మడి కరీంనగర్‌కు చెందిన ఎంతో మంది నాయకులు మావోయిస్టు పార్టీలో కీలకంగా పనిచేశారు. మావోయిస్టు కార్యకలాపాలు రాష్ట్రంలో వరంగల్ తర్వాత ఉమ్మడి జిల్లాలో అధికంగా ఉండేవి. రాష్ట్ర, కేంద్రస్థాయి నాయకులు సైతం ఇక్కడి వారే ఉండేవారు. ఉమ్మడి కరీంనగర్ నుంచి పీపుల్స్ వార్ ఉద్యమాన్ని విస్తరించే క్రమంలో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు తరలివెళ్లారు. పోలీసుల నుంచి నిర్బంధం పెరగడంతో కొందరు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు. పలువురు ఎన్‌కౌంటర్లలో మృతి చెందారు. ఈ క్రమంలో ఈనెల 20, 21 తేదీల్లో ఆర్ఎస్‌యూ ప్రస్థానం పేరిట హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పూర్వ విద్యార్థుల సభలు జరగనున్నాయి. ఈ సభలకు పూర్వ ఆర్ఎస్‌యూ విద్యార్థులు పాల్గొన నున్నారు.

- ఉద్యమంపై నీలినీడలు

మావోయిస్టుల అణచివేత క్రమంలో దేవన్న నాయకత్వం నుంచి అరికిల్ల శంకర్(లింగన్న), దొమ్మటి అర్జయ్య(నాగరాజు), నిర్మలక్క, పద్మక్కలు ఉద్యమాన్ని ముందుకు నడిపించారు. బోడగుండ సత్తయ్య(భూమన్న), రెడ్డిరాజుల రాజయ్య, దొమ్మటి అర్జయ్యలు లొంగిపోవడం, బయ్యపు సమ్మిరెడ్డి ఉద్యమాన్ని టార్గెట్ చేయడం, కత్తుల సమ్మయ్య, జడల నాగరాజులు ఉద్యమనేతలు కుటుంబాలను టార్గెట్ చేయడం వెరసి ఇక్కడ నీలినీడలు నెలకొన్నాయి.

ప్రస్తుతం ఉద్యమంలో పెద్దపల్లి డివిజన్ నుంచి కేవలం పుల్లూరి ప్రసాద్‌రావు, వేణు, కంకణాల రాజిరెడ్డి మొదలగు ఐదుగురు మాత్రమే ఉద్యమంలో కొనసాగుతున్నారు.

పీపుల్స్‌వార్ చేపట్టిన ఆనాటి పోరాటాలు ఆపార్టీకి, ఈప్రాంత ప్రజలకు తీపి, చేదు కలయికల జ్ఞాపకంగా మిగిలిందని చెప్పవచ్చు. ఈ క్రమంలో జరిగే 50ఏళ్ల ఆర్ఎస్‌యూ ప్రస్థానంలో ఉద్యమ చరిత్రను గుర్తు చేసుకోనున్నారు.

- అసువులు బాసిన అగ్రనాయకులు

మావోయిస్టు పార్టీలో ఉన్న అగ్రనాయకులు అసువులు బాసారు. జగిత్యాల జైత్రయాత్ర ద్వారా ఉద్యమాన్ని ఉగ్రూతలూగించారు. నాటి అగ్రనాయకులు బండ గణపతి (ముప్పాల లక్ష్మణరావు), బయ్యపు దేవేందర్‌రెడ్డి(దేవన్న), దగ్గురాజలింగు (సాగర్), మీసాల రాజిరెడ్డి, నల్ల ఆదిరెడ్డి ఆధ్వర్యంలో మల్లోజుల కోటేశ్వర్‌రావు, మల్లోజుల వేణుగోపాల్, రామయ్యపల్లె రమణారెడ్డి, తుంగాని రాజన్న, బుర్ర చిన్నన్న(మాధవ్), రామన్న, గూడెం ప్రసాద్, వడ్కాపూర్ చంద్రమౌళి, పుల్లూరి ప్రసాదరావు(చంద్రన్న), ఆవుల రాజమౌళి ద్వితీయ శ్రేణి నాయకత్వంలో బుర్ర రాజమల్లు, వేగోలపు రాజేందర్, రామోజుల శంకరయ్యపంతులు (సిద్దిపేట చంద్రన్న), బుర్ర సమ్మన్న(దేవన్న), వసంత, శివాజి తదితరులు మరణించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడు ధర్మపురి శ్రీనివాస్ అరెస్టు చూపుతున్న బసంత్‌నగర్ పోలీసులు

పాలకుర్తి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని జీడీనగర్‌లో శివరాత్రి పోషమ్మ(65)ను మద్యం మత్తులో కర్రతో కొట్టిచంపిన కేసులో నిందితుడు ధర్మపురి శ్రీనివాస్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపారు. బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఎస్ఐ వివరాలు వెల్లడించారు. పోషమ్మ భర్త 20 సంవత్సరాల క్రితం చనిపోయాడు. కొడుకు రామగుండంలో ఉండగా పోషమ్మ జీడీనగర్‌లో ఉంటోంది. కేశోరాం సిమెంటు కంపెనీలో వెల్డర్‌గా పనిచేస్తున్న ధర్మపురి శ్రీనివాస్ మద్యానికి బానిస కావడంతో అతడి భార్య తన పుట్టింట్లో ఉంటోంది. ఒంటరిగా ఉంటున్న శ్రీనివాస్ ఇంట్లో పోషమ్మ పనిచేస్తుందని, ఇద్దరూ సహజీవనం చేసేవారు. బీసీ కాలనీ నుంచి జీడీనగర్‌కు వెళ్లి గుడుంబా తాగేవారు. కొన్ని రోజులుగా పోషమ్మ మరో వ్యక్తి పర్వతం కిష్టయ్యతో సన్నిహితంగా ఉండడం చూసిన శ్రీనివాస్ ఆమెను నిలదీశాడు. నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో శ్రీనివాస్ పోషమ్మను చంపాలని నిర్ణయించుకున్నాడు. 9వ తేదీన ఇద్దరూ కలిసి జీడీనగర్ ప్రాంతానికి గుడుంబా తాగడానికి వెళ్లి తిరిగి వస్తుండగా సాయంత్రం ఆరు గంటల సమయంలో శ్మశానవాటిక వద్దకు రాగానే పోషమ్మతో గొడవ పెట్టుకొని కర్రతో తలపై కొట్టగా పోషమ్మ కిందపడిపోయింది. ఆమె చనిపోయిందని నిర్ధారించుకొని శ్మశానంలోకి తీసుకువెళ్లి అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న పెట్రోల్ పోసి నిప్పు అంటించాడు. అనంతరం ఇంటికి వెళ్లి జ్వరం వచ్చిందని ఇంట్లోనే ఉన్నాడు. శ్మశాన వాటికలో సగం కాలిపోయిన స్థితిలో శుక్రవారం మృతదేహం లభించగా మృతురాలి కొడుకు శివరాత్రి అంజి ఫిర్యాదు మేరకు ఎస్ఐ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శ్రీనివాస్‌పై అనుమానంతో విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. ఈ మేరకు నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్స్ శివకుమార్, సురేష్, శ్రీనివాస్‌ను ఎస్ఐ అభినందించారు.

మహాశివరాత్రి జాతరకు రండి..

సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించిన విప్ ఆది

రాజన్న ఆలయ విస్తరణ పనులపై సీఎం ఆరా..



సీఎం రేవంత్‌రెడ్డికి మహాశివరాత్రి జాతర ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో ఈనెల 26వ తేదిన నిర్వహించే మహాశివరాత్రి జాతరకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డిని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆహ్వానించారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఆది శ్రీనివాస మహాశివరాత్రి జాతర ఆహ్వాన పత్రికను మంగళవారం అందజేయగా, ఆలయ అర్చకులు రాజన్న ప్రసాదం అందజేసి వేదోక్త ఆశీర్వచనాన్ని గావించారు. అనంతరం మహాశివరాత్రి జాతర వేడుకలకు ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సీఎం సలహాదారు నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌తో పాటు పలువురు ఎంపీలకు, ఎమ్మెల్యేలకు మహాశివరాత్రి జాతర ఆహ్వాన పత్రికను అందజేసినట్లు తెలిపారు.

రాజన్న ఆలయ విస్తరణ పనులపై సీఎం ఆరా..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధి పనులపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. రాజన్న ఆలయ అభివృద్ధి పనులు ఎక్కడి వరకు వచ్చాయని ప్రశ్నించగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ టెండర్ దశలో ఉన్నాయని వివరించారు. గత ప్రభుత్వంలో రాజన్న ఆలయ అభివృద్ధి పనుల్లో జాప్యం జరిగిందని, అలా చేయకుండా పనులను వేగవంతం చేయాలని, భక్తులకు మెరుగైన సౌకర్యాలతో కూడిన దర్శనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతేకాకుండా వేములవాడ రాజన్న భక్తులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రోడ్డు వెడల్పు పనులకు భూసేకరణ కోసం నిధులు విడుదల చేయాలని సంబంధిత అధికారులకు సీఎం ఆదేశాలు జారీచేశారు.

మహాశివరాత్రికి ఘనంగా ఏర్పాటు చేయాలి

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలన్నారు. భక్తులకు శీఘ్రదర్శనం క్యూలైన్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి వసతి, చలువ పందిళ్లు తదితర ఏర్పాట్లు ముమ్మరం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అర్చకులు చంద్రగిరి శరత్, గొపన్నగారి చందు, మామిడిపల్లి శరత్, కంబల్ల వెంకన్న తదితరులు ఉన్నారు.

ఆహ్వానపత్రిక విడుదల

ఒక్క రోజు ముందే స్వామివారికి ప్రభుత్వ పట్టువస్త్రాలు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి క్షేత్రంలో నిర్వహించే మహాశివరాత్రి జాతర ఆహ్వాన పత్రికను, వాల్‌పోస్టర్స్‌ను ఆలయ ఈవో వినోద్‌రెడ్డి విడుదల చేశారు. రాజన్న ఆలయంలో ఫిబ్రవరి 25 నుంచి 27వ తేది వరకు మూడు రోజులు మహాశివరాత్రి వేడుకలను అంగరంగా వైభవంగా నిర్వహించనున్నారు. అందుకు అనుగుణంగా పనులు వేగవంతంగా చేపడుతున్నారు. 25 ఫిబ్రవరి మంగళవారం రాత్రి 7 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీస్వామి వారికి పట్టువస్త్రాలను, రాత్రి 7.30 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీతిరుమల, తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీస్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించనున్నారు.

రాత్రి 9 గంటల కు నిశీపూజ అనంతరం భక్తుల సౌకర్యార్థం లఘు దర్శనం, కోడె మొక్కుబడిని కొనసాగించనున్నట్లు తెలిపారు. కాగా, ఫిబ్రవరి 26 బుధవారం మహాశివరాత్రి పర్వదినం రోజున ఉదయ త్పూర్వం 1.30 గంటల వరకు పురజనులకు సర్వదర్శనం 1.30 నుంచి 2.30 వరకు దాతలు, స్థానిక అధికారులకు దర్శనం, 3.30 నుంచి 3.40 గంటల వరకు ఆల య శుద్ధి, మంగళవాయిద్యాలు, 3.40 నుంచి 4.23 గంటల వరకు సుప్రభాత సేవ, 4.30 గంటల నుంచి 6 గంటల వరకు ప్రాతఃకాల పూజ అనువంశిక అర్చకుల దర్శనము, సాయంత్రం 6.05 గంటలకు శ్రీస్వామివారి కల్యాణ మండపంలో మహాలింగార్చన, రాత్రి 11.35 గంటలకు లింగోద్భవ కాలంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 27 గురువారం ఉదయం సుప్రభాతం, ప్రాతఃకాల పూజ అనంతరం భక్తుల మొక్కులకు ఆర్జిత సేవలు ప్రారంభవుతాయని పేర్కొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా మహాశివరాత్రి జాతర వాల్‌పోస్టర్లు..



వాల్‌పోస్టర్‌లను అతికిస్తున్న ఆలయ సిబ్బంది

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతర వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఈవో వినోద్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రధాన ప్రాంతాల్లో మహాశివరాత్రి జాతర వాల్‌పోస్టర్‌లను అతికించేందుకు నిర్ణయం తీసుకున్నారు. మహాశివరాత్రికి మూడు రోజుల పాటు నిర్వహించే పూజల వివరాలతో కూడిన వాల్‌పోస్టర్‌ను రాష్ట్ర వ్యాప్తంగా అతికించాలని ఆలయ సిబ్బందిని ఏర్పాటుచేశారు. సిబ్బంది వెంటనే ఆయా ప్రాంతాలకు వేర్వేరుగా వెళ్లి వాల్‌పోస్టర్లును అతికించారు.

కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మకం



- పట్టభద్రుల ఎమ్మెల్సీపై గురి
- సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకోవాలని ప్రయత్నాలు
- గ్రామస్థాయి నేతలకు బాధ్యతల అప్పగింత
- శ్రేణులతో మంత్రులు, ఎమ్మెల్యేల భేటీలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. రాష్ట్రంలో అధికార పార్టీగా ఉండడమే కాకుండా సిట్టింగ్ స్థానం కావడంతో దానిని తిరిగి కైవసం చేసుకోవడానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేయడానికి పలువురు ఆసక్తి చూపించినా ఆ పార్టీ అధిష్టానవర్గం చివరకు ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డిని అభ్యర్థిగా రంగంలోకి దింపింది. ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో ఆరుగురు ఎంపీలు, 42 మంది ఎమ్మెల్యేలు ఉండగా అందులో కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యేలే అధికంగా ఉన్నారు. 23 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు ఈ నియోజకవర్గ పరిధిలో ఉన్నారు.

బీజేపీకి చెందిన నలుగురు ఎంపీలు, ఏడుగురు ఎమ్మెల్యేలు కూడా ఈ నియోజకవర్గంలోనే ఉన్నారు. ఈ పరిధిలో 12 మంది ఎమ్మెల్యేలను కలిగి ఉన్నా బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిని పోటీలో నిలుపలేదు. కాంగ్రెస్‌తో పాటు బీజేపీ కూడా ఈ స్థానంపై కన్నేసి గెలుపుకోసం ప్రయత్నాలు చేస్తున్నది. 2019 లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో 17 మంది పోటీలో ఉండగా మాజీ మంత్రి టీ.జీవన్‌రెడ్డి 56,698 ఓట్లను సాధించి తొలి రౌండ్ లెక్కింపులోనే విజయం సాధించారు. 1,15,458 ఓట్లు పోల్ కాగా బీఆర్‌ఎస్‌కు చెందిన చంద్రశేఖర్‌గౌడ్‌కు 17,268, బీజేపీకి చెందిన సుగుణాకర్‌రావుకు 15,077, యువతెలంగాణ పార్టీకి చెందిన రాణి రుద్రమకు 5,192 ఓట్లు వచ్చాయి. 9,932 ఓట్లు చెల్లకుండా పోయాయి. అయితే ఈసారి ఈ నియోజకవర్గంపై దృష్టిసారించిన అభ్యర్థులు ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఓటర్ల నమోదును సీరియస్‌గా తీసుకున్నారు. పోటాపోటీగా పట్టభద్రుల ఓటర్ల నమోదుపై ప్రయత్నాలు చేయడంతో నియోజకవర్గ పరిధిలో 3,55,159 ఓట్లు నమోదయ్యాయి. వీటిలో 45శాతం ఓట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోనే ఉన్నాయి.

ఈ ఉమ్మడి జిల్లా పరిధిలో 1,60,260 ఓట్లు ఉండడంతో అన్ని రాజకీయపార్టీలు కరీంనగర్ కేంద్రంగా చేసుకొని ప్రచారం కొనసాగిస్తున్నాయి. కాంగ్రెస్‌పార్టీకి చెందిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ తమతమ నియోజకవర్గాల్లోనే కాకుండా తాము ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలపై ప్రత్యేక దృష్టిసారించి ఎమ్మెల్యేలను, ఇతర ప్రజాప్రతినిధులను, పార్టీ నేతలను ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగస్వాములను చేసి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న ఇద్దరు ఎంపీలతో పాటు 23 మంది ఎమ్మెల్యేలు కూడా అభ్యర్థి విజయం కోసం కృషిచేస్తున్నారు. అధికార పార్టీ అయి ఉండి సిట్టింగ్ స్థానంలో ఓడిపోతే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో దీని ప్రభావం పడుతుందని 42 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఉండడంతో ఇక్కడి విజయం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఊపును ఇస్తుందని భావిస్తున్నారు.

అందుకే ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్‌పార్టీ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నది. పోలింగ్ బూత్‌లవారీగా ఉన్న ఓట్లను ప్రాతిపదికగా చేసుకొని ఒక ఇంచార్జిని నియమించడంతోపాటు ప్రతి 50 మంది ఓటర్లకు ఒక బాధ్యున్ని ఏర్పాటు చేసి ఆయన ద్వారానే ఓటర్లను కలిసే కార్యక్రమం చేపట్టాలని, ఓటర్లను మెప్పించి ఓటింగ్‌కు తీసుకవచ్చే బాధ్యతను ఆయా ఓటర్లు ఉన్న గ్రామ కాంగ్రెస్ నాయకులకు అప్పగించేందుకు పార్టీ నేతలు, అభ్యర్థి జాబితాను తయారు చేస్తున్నారని ప్రచారం జరుగుతున్నది. ఈనెల 27న పోలింగ్ జరుగనుండగా ఈవారం రోజుల వ్యవధిలో ఓటర్లను రెండుసార్లు అయినా కలిసి సానుకూల ఓటింగ్ జరిగేలా చూసుకునేందుకు ఆ పార్టీ ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం. ముఖ్యంగా మంత్రులు తమతమ జిల్లాల పరిధిలో వీడియో కాన్ఫరెన్సు ఏర్పాటు చేసి శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో బీజేపీకి వివిధ విభాగాలు చురుకుగా పనిచేసే అవకాశాలుండడంతో అదే స్థాయిలో ప్రయత్నాలు లేని పక్షంలో సానుకూల ఫలితాలను సాధించలేమని భావిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు స్థానిక కమిటీలపై ప్రత్యేక బాధ్యతలు ఉంచుతూ గెలుపు ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నట్లు సమాచారం.

ఆస్తి పన్ను వసూళ్లలో రికార్డు



- రాష్ట్రంలో తొలి రెండు స్థానాల్లో జమ్మికుంట, హుజూరాబాద్‌లకు చోటు
- 11 స్థానాల్లో ఉమ్మడి జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలకు స్థానం
- ఈనెల 18వ తేదీ వరకు కోరుట్లకు ఐదో స్థానం, మెట్‌పల్లికి తొమ్మిదో ర్యాంకు

జగిత్యాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ఆస్తి పన్ను వసూళ్లలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు మున్సిపాలిటీలు ముందంజలో ఉన్నాయి. తొలి పదకొండు స్థానాల్లో ఉమ్మడి జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలకు చోటు దక్కడం విశేషం. మున్సిపల్ శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం ఈనెల 18వ తేదీ వరకు రాష్ట్రంలో ఆస్తిపన్ను వసూళ్లలో ఉమ్మడి జిల్లా పరిధిలోని జమ్మికుంట మున్సిపాలిటీ ప్రథమ స్థానంలో నిలవగా హుజూరాబాద్ ద్వితీయ స్థానంలో ఉంది. తొలి పదకొండు స్థానాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన సిరిసిల్ల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ మున్సిపాలిటీలు చోటు సంపాదించాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు మార్చి నెలాఖరులోగా వంద శాతం లక్ష్యం నెరవేర్చే దిశగా మున్సిపాలిటీలు ముందుకు వెళ్తున్నాయి.

జమ్మికుంటలో 83.49 శాతం వసూళ్లు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట మున్సిపాలిటీ 83.49 శాతం ఆస్తి పన్ను వసూలు చేసి రాష్ట్రంలో తొలిస్థానాన్ని కైవసం చేసుకుంది. జమ్మికుంట మున్సిపాలిటీలో 12,603 గృహాలుండగా రూ.3.50 కోట్ల లక్ష్యానికిగాను రూ.2.63 కోట్లు వసూలు చేసి ప్రథమ స్థానంలో నిలిచింది. 80 శాతం పన్ను వసూలు చేసి హుజూరాబాద్ మున్సిపాలిటీ ద్వితీయ స్థానంలో నిలిచింది. హుజూరాబాద్ మున్సిపాలిటీలో రూ.2.65 కోట్ల లక్ష్యానికి గాను రూ.2.12 కోట్లు వసూలు అయ్యాయి. సిరిసిల్ల మున్సిపాలిటీలో 23,483 గృహాలుండగా రూ.6.30 కోట్ల లక్ష్యానికిగాను రూ.4.70 కోట్లు వసూలు చేసి 74.60 శాతం సాధించి నాల్గవ స్థానంలో నిలిచింది. జగిత్యాల జిల్లాలోని కోరుట్ల మున్సిపాలిటీలో 19,182 గృహాలుండగా రూ.5.05 కోట్ల లక్ష్యానికి గాను రూ.3.64 కోట్లు వసూలు చేసి 72.08 శాతం సాధించి ఐదో స్థానం సంపాదించింది.

మెట్‌పల్లి మున్సిపాలిటీలో 13,476 గృహాలుండగా రూ.3.95 కోట్ల లక్ష్యానికిగాను రూ.2.64 కోట్లు వసూలు చేసి 66.84 శాతం సాధించి తొమ్మిదవ స్థానంలో, రాయికల్ మున్సిపాలిటీలో 5,367 గృహాలుండగా రూ.1.32 కోట్ల లక్ష్యానికి గాను రూ.86లక్షలు వసూలు చేసి 65.15 శాతం సాధించి పదకొండో స్థానంలో నిలిచింది. జగిత్యాల మున్సిపాలిటీలో 27,186 గృహాలుండగా రూ.13.42 కోట్ల లక్ష్యానికిగాను రూ.6.15 కోట్లు వసూలు చేసి 45.83 శాతం సాధించి 87వ స్థానంలో, ధర్మపురి మున్సిపాలిటీలో 4,629 గృహాలుండగా రూ. 1.34 కోట్ల లక్ష్యానికి గాను రూ.61లక్షలు వసూలు చేసి 45.52 శాతం సాధించి 89వ స్థానంలో నిలిచింది.





జమ్మికుంట మున్సిపల్ కార్యాలయం, మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయం

కొండగట్టులో భక్తుల రద్దీ



ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిదానం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. సుమారు పదిహేను వేలకు పైగా స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం, పార్కింగ్ ప్రదేశం నిండి పోయాయి.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అల్లీపూర్ విద్యార్థి



రాయికల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం అల్లీపూర్ పాఠశాలకు చెందిన విద్యార్థి పి.రిశ్వంత్ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 16వ తేదీన జగిత్యాలలోని వివేకానంద మినీ స్టేడియంలో జరిగిన జిల్లా కబడ్డీ అసో సియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ ఎంపిక పోటీల్లో రిశ్వంత్ పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచాడు. ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు వికారా బాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూని యర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఎంపికైన విద్యార్థిని ఏఎంసీ చైర్మన్ అంజలి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు శిక్షణ



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న రీజినల్ మేనేజర్ బి రాజు

భగత్‌నగర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా సంస్థ ఉద్యోగులకు శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆర్టీసీ వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. కరీంనగర్-2 డిపోలో శిక్షణ తరగతులను ఆర్‌ఎం బి రాజు, డిప్యూటీ ఆర్‌ఎం సత్యనారాయణ ప్రారంభించారు. కరీంనగర్-1 డిపోలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎస్ భూపతి రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్‌లు వి మల్లయ్య, విజయమాధురి, సూపర్‌వైజర్లు హిమబిందు, వీరస్వామి, విజయలక్ష్మి, తిరుపతి పాల్గొన్నారు.

భూమి పట్టా చేయిస్తానని రూ. 31.50లక్షలు టోకరా



బాధితుడు రాజమల్లయ్య

శంకరపట్నం, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మండలం పచ్చునూర్ గ్రామానికి చెందిన పురోహితుడు వైరాగ్యపు రాజమల్లయ్యకు ఎకరం భూమి పట్టా చేపిస్తానని, ఎస్సారెస్పీ భూమి పరిహారం కింద రూ. 96 లక్షలు ఇప్పిస్తానని రూ. 31.50 లక్షలు ఓ వ్యక్తి టోకరా వేసిన సంఘటన వెలుగు చూసింది. శంకరపట్నం మండలం కేశవపట్నంలో మంగళవారం బాధితుడు వైరాగ్యపు రాజమల్లయ్య విలేకరులతో తన గోడు వెళ్లబోసుకున్నాడు. మానకొండూర్ మండలం ఊటూరు గ్రామానికి చెందిన మాచర్ల రాజయ్య శంకరపట్నం మండలం తాడికల్‌లో నివాసం ఉంటున్నాడు. 2023 సంవత్సరంలో ఊటూరులో మాచర్ల రాజయ్య తల్లి దిశ దినకర్మకు వెళ్లిన పురోహితుడు రాజమల్లయ్యతో మాచర్లరాజయ్యకు పరిచయం ఏర్పడింది.

ఈ క్రమంలో రెవెన్యూ కార్యాలయాల్లో మంచి సంబంధాలు ఉన్నాయని, ఏ పనైనా చేయగలుగుతానని బాధితుడు వైరాగ్యపు రాజమల్లయ్యను మాచర్ల రాజయ్య నమ్మించాడు. తనకు ఏడెకరాల భూమి ఉందని, అందులో ఆరెకరాల భూమి పట్టా అవ్వగా ఒక ఎకరం భూమి పట్టా కాలేదని బాధితుడు మాచర్ల రాజయ్యకు తెలిపారు. ఇదే అదునుగా మాచర్ల రాజయ్య బాధితుడు వైరాగ్యపు రాజమల్లయ్యతో మాట్లాడి ఎకరా భూమి పట్టా చేయిస్తానని లక్ష రూపాయలు ఇవ్వాలని సూచించడంతో ఫోన్ పే ద్వారా లక్ష రూపాయలు మాచర్ల రాజయ్యకు అప్ప చెప్పి నట్లు బాధితుడు తెలిపారు. కాగా ఒక ఎకరం పట్టాతో పాటు ఎస్సారెస్పీ కాలువలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ప్రభుత్వం చెల్లిస్తుందని, మరికొంత డబ్బులు అప్ప చెప్పితే రూ. 96లక్షలు పరిహారం ఇప్పిస్తానని నమ్మ బలికాడన్నారు. దీంతో విడతల వారీగా రాజయ్యకు రూ. 31.50లక్షల వరకు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బులు అప్పజెప్పానన్నాను.

పరిహారం రాకపోవడంతో అనుమానంతో జిల్లా కలెక్టరేట్‌కి వెళ్లి వివరాలు తెలుసు కున్నానని ప్రభుత్వం ఎవరికి కూడా పరిహారం ఇవ్వలేదని అధికారులు తెలిపారన్నారు. దీంతో మోసపోయామని గ్రహించినట్లు వైరాగ్యపు రాజమల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పలుమార్లు రాజయ్య ఇంటి వద్దకు వెళ్లి డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరడంతో అధికారికి డబ్బులు ఇచ్చానని తెలపడంతో వేచి చూశానన్నారు. అయినా భూమి పట్టా చేయకుండా, పరిహారం ఇప్పించకుండా పరి హారం వచ్చినట్లు ఫేక్ సర్టిఫికెట్లు అందించాడని పేర్కొన్నా రు. మాచర్ల రాజయ్యపై పోలీస్ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తన వద్ద వసూలు చేసిన రూ. 31.50లక్షలు ఇప్పించాలని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు వైరాగ్యపు రాజమల్లయ్య తెలిపారు.

బద్దిపోచమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి అనుబంధ శ్రీబద్దిపోచమ్మ అమ్మవారి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నెత్తిన బోనాలతో నిరీక్షించారు. తెల్లవారు జామున భక్తులు మట్టిపాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్లతో, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా బద్దిపోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఆలయ మండపంలో అమ్మవారికి పట్నాలు వేసి, నూతన వస్త్రాలు సమర్పించి దర్శించుకున్నారు. బద్దిపోచమ్మకు నైవేద్యాన్ని పెట్టి కల్లుసాక పోస్తూ పిల్లపాపలు, పాడిపంటలు చల్లంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తుల తాకిడితో ఈవో వినోద్‌రెడ్డి సంబంధిత ఉద్యోగులను అప్రమత్తం చేశారు.



బోనాలతో క్యూలో భక్తులు

టీచర్ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థికి బీసీ సంఘాల మద్దతు

భగత్‌నగర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీచర్ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్యకు బీసీ జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీ, ఎస్టీ, ఎస్సీమైనార్టీలు రాజకీయాలకతీతంగా బీసీ నాయకుడు మల్క కొమురయ్యను గెలపించాలన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య మాట్లాడుతూ పీఆర్‌టీయూను నమ్మే పరిస్థితి ఇప్పుడు లేదన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తానన్నారు. తనకు మద్దతు ప్రకటించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

టీఎస్సీఎస్టీయూఎస్, టీటీయూ మద్దతు

టీచర్ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్యకు ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ప్రకటించాయి. తెలంగాణ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోతు కిషన్‌నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిమల్ల చిట్టిబాబులు సంయుక్త ప్రకటనలో మద్దతు ప్రకటించారు. టీటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మునగాల మణిపాల్‌రెడ్డి, పోలంపల్లి ఆదర్శన్‌రెడ్డిలు మల్క కొమురయ్యకు మద్దతు ప్రకటిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.



టీచర్ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిమల్క కొమురయ్యకు మద్దతు తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు జాజుల శ్రీనివాస్‌గౌడ్

అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన ప్రధానిమోదీ

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

భగత్‌నగర్: భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రధాని మోదీ గుర్తింపు తీసుకువచ్చారని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాలయంలో బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్యతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థులుగా అంజిరెడ్డి, మల్క కొమురయ్యలను గెలిపించాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు, మాజీమేయర్‌లు సునీల్ రావు, డి శంకర్, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిల రమేష్, కొలగాని శ్రీనివాస్, బంగారి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు సౌర వెలుగులు

(5వ పేజీ తరువాయి)

సామర్థ్యం గల ప్యానళ్ల ద్వారా ఉత్పత్తి అయ్యే సోలార్ విద్యుత్‌ను ఎన్పీడీసీఎల్ ఏర్పాటు చేసిన గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్ మొత్తం గ్రిడ్‌కు వెళుతుంది. ఇక్కడ ఉత్పత్తయిన విద్యుత్ గ్రిడ్‌కు ఎంత మొత్తంలో పోతున్నదో కంట్రోల్ బోర్డులో రికార్డు చేసేం దుకు మీటర్లను ఏర్పాటు చేశారు. 200 కేవీఏ సోలార్ ప్యానళ్ల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ 160 కిలో వాట్స్ విద్యుత్‌కు సమానం అని ఎన్పీడీసీఎల్ అధికారులు పేర్కొన్నారు. 160 కిలోవాట్స్ విద్యుత్ 1,60,000 వాట్స్‌తో సమానమని చెప్పారు. ఎడమ పక్కన ఏర్పాటు చేసిన సోలార్ ప్యానళ్ల ద్వారా 45 రోజుల క్రితం విద్యుత్ ఉత్పత్తి కాగా, కుడి పక్కనే ప్యానళ్ల ద్వారా నెల రోజుల నుంచి విద్యుత్ ఉత్పత్తి అవుతున్నది. సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం వల్ల కలెక్టరేట్‌కు నెలకు దాదాపు 3 లక్షల రూపాయల వరకు విద్యుత్ బిల్లు ఆదా కానున్నది.

ఉచిత మెగా వైద్య శిబిరం

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 110మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అంద జేశారు. వైద్యులు డాక్టర్ నాగరాజు, గుర్రం కిరణ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యసిబ్బంది కరుణాకర్, హరీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు

మంథని, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పోచమ్మవాడలోని శివనాగేంద్ర దేవాలయం సమీపంలోని ఈనెల 20, 21 తేదీల్లో శివలింగం జీర్ణోద్దరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మంగళవారం ఆర్గనైజర్లు తెలిపారు. వేద పండితుడు దుద్దిళ్ళ మారుతి ఆధ్వర్యంలో మంత్రపురి వైదిక బృం దం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శ

మంథని, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచ్ హైకోర్టు న్యాయ వాది ఇనుముల సతీష్ తండ్రి రిటైర్డ్ ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ ఇనుముల శంకరయ్య ఇటీవల మృతి చెందగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు సోమవారం రాత్రి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శంకరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉపాధిహామీ మండల ఈసీగా మౌనిక

రామగిరి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ ఉపాధిహామీ ఈసీగా మౌనిక మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానికంగా పని చేసిన లక్ష్మణ్ ముత్తారం మండలం ఈసీగా బదిలీ పైవెళ్ళగా ఆయన స్థానంలో నాగర్‌కర్నూల్ నుంచి వచ్చిన మౌనిక బాధ్యతలు స్వీకరించారు.

మాజీ కార్పొరేటర్‌కు సన్మానం

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 44వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముస్తాఫాను మంగళవారం డివిజన్‌లోని యువకులు సన్మానించారు. కార్పొరేటర్‌గా ప్రజలకు అందు బాటులో ఉంటూ పలు సమస్యలు పరిష్కారానికి కృషి చేశారని కొనియా డారు. దేశెట్టి శ్రీనివాస్, చాతబోయిన శ్రీనివాస్, బండి మురళీ, బండి సతీస్, రాజేందర్, బనగంటి సతీష్, దూళికట్ట సతీష్, పాల్గొన్నారు.

పదవీ విరమణ కార్మికులకు సన్మానం

పాలకుర్తి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ సిమెంటు కర్మాగారంలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన కార్మికులు నంది నారాయణ, పన్నాల సాంబయ్య, గొట్టె కనుకయ్యలను మంగళ వారం కంపెని అధికారులు, కార్మిక సంఘం నాయకులు సన్మానించారు. మాదాసు శ్రీనివాస్, కర్ణకంటి సదానందం, శ్యామ్‌సుందర్ రావు, బత్తుల విజయ, బత్తిని సతీష్‌గౌడ్, తీగెల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు

రామగిరి, ఫిబ్రవరి, 18(ఆంధ్రజ్యోతి): బేగంపేట్‌లోని సాయి ప్రగతి పాఠశాలలో మంగళవారం కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బర్లశ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు శ్రీకాంత్ డెంటల్ వైద్యులు ఉచిత దంత పరీక్షలను నిర్వహించారు. బీడీఎస్ సిరిచందన్ పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రోజు రెండు సార్లు బ్రష్ చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. డైరె క్టర్స్ అనిల్‌కుమార్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, ఇంచార్జీ ప్రశాంతి పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

పాలకుర్తి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పాలకుర్తి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం రథోత్సవంతో ముగిశాయి. సోమవారం రాత్రి జరిగిన కళ్యాణోత్సవంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ పాల్గొని పూజలు చేశారు. ప్రజలు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని చెన్న కేశవస్వామిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

రైతులకు మరిన్ని సేవలందించాలి



మంత్రి శ్రీధర్‌బాబు సన్మానిస్తున్న చైర్మన్‌కొత్త శ్రీనివాస్, డైరెక్టర్లు.

మంథని, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు మరిన్ని సేవలు అం దించడానికి సహకారం సంఘాల పాలక వర్గాల పదవీ కాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం పొడిగించినట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు సూచించారు. పదవీ కాలాన్ని పొడిగించడంపై మంథని పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, డైరెక్టర్లు సోమవారం రాత్రి మంత్రి శ్రీధర్‌బాబు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. తమ పదవీకా లాన్ని పొడిగించినందుకు మంత్రి శ్రీధర్‌బాబుకు, ప్రభుత్వానికి ధన్యవా దాలు తెలిపారు. డైరెక్టర్లు ఉడుత మాధవి-పర్వతాలుయాదవ్, దాసరి లక్ష్మి, పెద్దరాజు ప్రభాకర్, కొత్త శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఇంటి పన్ను, ట్రేడ్ లైసెన్స్ సకాలంలో చెల్లించాలి

మంథనిరూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని ప్రజలు ఇంటి పన్నును, వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్‌ను సకాలంలో చెల్లిం చాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్ మంగళవారం సూచించారు. లేని పక్షంలో అపరాధ రుసుము విధించాల్సి ఉంటుందన్నారు. ట్రేడ్ లైసెన్స్ లేని వారు తమ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు.

కార్మిక వర్గంపై కేంద్ర బడ్జెట్ ప్రభావం

ధర్మారం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్మిక వర్గంపై ప్రభావం చూపే విధంగా ఉందని సీఐటీయు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్-కార్మిక వర్గంపై ప్రభావం అనే అంశంపై కార్మికులతో సెమినార్ నిర్వహించారు. ముత్యంరావు మాట్లాడు తూ సామాన్య ప్రజలపై భారం మోపుతూ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసే విధంగా మోదీ సర్కార్ బడ్జెట్ ప్రవేశ పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక బడ్జెటును నిరసిస్తూ ప్రజలంతా పోరాడాలని సూచించారు. సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి సీపెల్లి రవీందర్, మండల అధ్యక్షులు ఆకుల రాజయ్య, సీనియర్ నాయకులు రాయలింగు, నాయకులు శ్రీనివాస్, రాజు, కుమార్, రాజు, మల్లమ్మ, విజయ్య, అరుణ, నర్సమ్మ, నర్సయ్య, రైతులు కార్మికులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఏర్పాటు

పెద్దపల్లి టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి తోకల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో టీఎస్‌జేయూ జిల్లా అధ్యక్షుడిగా బొమ్మగాని శ్రీనివస్, కార్యదర్శిగా కారెంగుల సురేష్, కోశాధికారిగా వెంకటేశ్, ఉపాధ్యక్షులుగా రాజమల్లు, లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శులుగా తోట సతీష్, వెంకట్, హరీష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా రవీందర్, రవికుమార్, కార్యవర్గ సభ్యులుగా తిరుమలేష్, రాజేందర్, రాజులను ఎన్నుకున్నారు. అనంతరం సభ్యులకు చేసిన బీమా పత్రాలను మంగళవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష అందజేశారు.

స్కూల్ బస్సులో పరిమితికి మించి విద్యార్థులు

నిలదీసిన తల్లిదండ్రులు ● ఎంఈవోకు ఫిర్యాదు ● అధికారులు తనిఖీ చేపట్టాలని డిమాండ్

సుల్తానాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సుల్తానా బాద్ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. వీరిని బస్సు ల్లో తరలిస్తుంటారు. అయితే పరిమితికి మించి అం దులో పిల్లలను తరలిస్తున్నా అధికారులు పట్టించుకో వడం లేదు. మంగళవారం సుద్దాల గ్రామంలో పరిమి తికి మించి పిల్లలను బస్సులో ఎక్కించుకున్న విష యాన్ని తల్లిదండ్రులు నిలదీశారు. బస్సులను ఆపి ఆవే దన వ్యక్తం చేశారు. యాభై సీట్లు ఉన్న బస్సులో వందకు పైగా పిల్లలను ఎక్కించుకున్నారని తల్లిదండ్రు లు ఫిర్యాదు చేశారు. బస్సు ఫీజు కింద ఏడాదికి ఆరు వేల రూపాయల చొప్పున వసూలు చేస్తున్నారని, పిల్ల లను నిలబెట్టి తీసుకువెళుతున్నారని ఆరోపించారు. అయితే పాఠశాల సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని విద్యార్థుల తల్లిదండ్రులు వేల్పుల స్వామి, నక్కల శ్రీని వాస్, తిరుపతిరావు, మనోజ్‌రావు పేర్కొన్నారు. ఈ విష యమై ఎంఈవోకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. డ్రైవర్లు వేగంగా నడుపుతున్నారని, పరిమితికి మించి పిల్లలను అనుమతించకుండా చూడాలని కోరారు.



పరిమితికి మించి పిల్లలను తీసుకెళుతున్న స్కూల్ బస్సు

స్కూల్ బస్సుకు యేటా ఆరు వేల ఫీజు

- వేల్పుల స్వామి సుద్దాల

యేటా ఆరు వేల రూపాయలను స్కూల్ బస్సు ఫీజు చెల్లిస్తున్నాం. అయినా తమ పిల్లలు బస్సులో కూర్చుని వెళ్లింది లేదు. యాభై మంది కెపాసిటీ ఉంటే వంద మందిని ఎక్కించుకుంటున్నారు. బ్యాగులు భుజాన వేసుకుని క్యారియర్ చేతిలో పట్టుకుని బస్సులో నిలుచునే పరిస్థితి కూడా లేదు. అధికారులు చర్యలు తీసుకోవాలి

బస్సులో కుక్కుతున్నారు

- మనోజ్ రావు సుద్దాల

పట్టణంలోని ప్రైవేట్ స్కూల్ లో పిల్లలు చదువుతున్నారు. ఆ స్కూల్‌కు చెందిన మినీ స్కూల్ బస్సు కొలనూరు, గోపురపల్లి, రేగడిమద్దికుంట గ్రామాల నుంచి తమ గ్రామానికి వస్తుంది. అప్పటికే బస్సు పిల్లలతో నిండి ఉంటుంది. గ్రామం నుంచి నలభై మంది పిల్లలు బస్సులో ఎక్కాలి. పిల్లలను బస్సులో కిక్కిరి తరలిస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి

ఒజ్జ సతీష్

సుద్దాల గ్రామానికి పలు స్కూల్స్ నుంచి నాలుగైదు బస్సులు వస్తుంటాయి. అన్ని బస్సులలో కూడా కెపాసిటీకి మించి పిల్లలను అనుమతిస్తున్నారు. డ్రైవర్లు రాష్ డ్రైవింగ్ చేస్తుంటారు. అధిక లోడ్ కారణంగా బస్సులు అదుపు తప్పే ప్రమాదం ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ఓదెల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డి గెలుపునకు ప్రతీ కాం గ్రెస్ నాయకుడు, కార్యకర్తలు లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కోరారు. మం డల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను, నిరుద్యోగులకు కల్పించిన ఉద్యోగాలను పట్టభద్రులకు వివరిస్తూ అవగాహన కల్పించాలని కోరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, విజయపాల్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, చీకట్ల మొండయ్య, శంకర్ పాల్గొన్నారు.



ఓదెల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ రమణారావు

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్, నిజా మాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియో జకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్న నరేం దర్ రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతు నరేందర్ రెడ్డి గెలుపునకు కృషి చేయాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ ప్రకాష్ రావు, దామోదర్ రావు, పన్నాల రాములు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు, పార్టీ అధ్యక్షులు వేగోళం అబ్బయ్య గౌడ్, చిలుక సతీష్ తదితరులు పాల్గొన్నారు

ఎలిగేడు,(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. శివపల్లిలోని ఆయన ఇంట్లో ఎలిగేడు, జూలపల్లి పట్టభద్రులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కాం గ్రెస్ పార్టీ సూచించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఉన్న నరేందర్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు గోపు విజయభాస్కర్‌రెడ్డి, పుల్లూరి వేణుగోపాల్ రావు, నాయకులు వెంకటేశ్వర్‌రావు, గోపు లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, నరహరి సుధాకర్‌రెడ్డి, బూర్ల వెంకటసత్యం, రాజనర్సు, పాల్గొన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వీ. నరేందర్‌రెడ్డికి మద్దతుగా మంథని నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల కో-ఆర్డినేటర్, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వ హించారు. మేరీమీడియా హైస్కూల్, అలోక్ పబ్లిక్ హైస్కూల్‌లో పట్టభద్రులను కలిసి వీఎన్ఆర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఐలి ప్రసాద్, శశిభూషణ్ కాచే, నర్సింగరావు, కుడుదుల వెంకన్న, అజీంఖాన్, ఆరెల్లి కిరణ్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీలను గెలిపించాలి

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల, టీచర్స్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, మల్క కొమురయ్యలను గెలిపిం చాలని మంగళవారం గోదావరిఖని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహిం చారు. లావణ్య మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథ కాలను చూసి పట్టభద్రుల, టీచర్ల సమస్యల పరిష్కారానికి అంజిరెడ్డిని, మల్క కొముర య్యలను గెలిపించాలని ఆమె కోరారు. నాయ కులు మహవాది రామన్న, పెద్దపల్లి రవీం దర్, సుల్వ లక్ష్మీనర్సయ్య, అరుణ్ కుమార్, దాసరి శ్రీనివాస్, శివ, రాజు పాల్గొన్నారు.

జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థు లను గెలిపించాలని ఆ పార్టీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి కోరారు. పార్టీ మండల ఇన్‌చార్జి మిట్టపల్లి సతీష్ ఆధ్వర్యంలో అన్నపూర్ణకాలనీలో ఇంటింటికి వెళ్లి బీజేపీ అభ్యర్థులు మల్క కొమరయ్య (ఉపాధ్యాయ), అంజిరెడ్డి(గ్యాడ్యుయేట్) లకు మొదటి ప్రాధాన్యతా ఓటువేసి గెలిపించాలని సంధ్యారాణి కోరారు. పట్టభద్రులు, టీచర్ల సమస్యలు పరిష్కారానికి బీజేపీ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం లోని బీజేపీ చేస్తున్న అభివృద్ధిని చూసి పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ అభ్యర్థు లను గెలిపించాలన్నారు. బీజేపీ నాయకులు గాండ్ల ధర్మపురి, తోట కుమారస్వామి, గుండెబోయిన భూమయ్య, శ్రీకాంత్, రవికు మార్, మహేశ్, వీరేశం పాల్గొన్నారు.

ఆడపిల్లల పట్ల వివక్ష తగదు

ధర్మారం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆడ పిల్లల పట్ల వివక్ష చూప డం తగదని జిల్లా మహిళా సాధికారత కేం ద్రం కో-ఆర్డినేటర్ దయా అరుణ అన్నారు. మంగళవారం పత్తిపాక ఉన్నత పాఠశాలలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యం లో నిర్వహించిన కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యా ర్థులు ఉన్నత విద్యనే లక్ష్యంగా చేసుకొని చద వాలని కోరారు. చదువులో ఇబ్బందులు, కు టుంబాల్లో సమస్యలు ఉంటే వాటిని అధిగ మిస్తు పురోగతి సాధించాలని సూచించారు. బేటి బచావో బేటి పడావో ప్రాముఖ్యతను వివరించారు. అంగన్వాడీ సూపర్‌వైజర్ బ్లాం డీన, చైల్డ్ లైన్ కోఆర్డీనేటర్ ఉమాదేవి, సఖి లీగల్ కౌన్సిలర్ సుమతీ, ఐసీపీఎస్ బృంద సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులతో ఎమ్మెల్యే సమావేశం

గోదావరిఖని, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఒక కార్మికుని బిడ్డగా కార్మికులకు అండగా నేనుంటానని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంట్రాక్టు కార్మికు లతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఓసీపీ-5, ఆర్‌వీ ఆర్, వీ నైన్, పీసీ పటేల్ ఓబీ కంపెనీలలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న కార్మికు లు మూడు రోజుల నుండి విధులకు వెళ్లకుండా సమ్మె చేస్తున్న సందర్భంలో ఎమ్మె ల్యేను కలిసి వారి సమస్యలను వివ రించారు.



కాంట్రాక్టు కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

రెండు మూడు సంవత్సరాలుగా కాంటాక్టు కార్మికులకు జీతాలు పెంచడం లేదని, చాలీ చాలని బతుకులతో జీవితం వెళ్లదీస్తున్నా మన్నారు. ఎమ్మెల్యే కాంట్రాక్టర్లతో మాట్లాడి రూ.4వేల వేతనం పెం చాలని సూచించారు. దీనిపై కాంట్రాక్టు కం పెనీలు త్వరలోనే నిర్ణ యం తీసుకుంటామని తెలిపారు. సమస్య పరిష్కారమయ్యే వరకు సమ్మెలోనే ఉండాలని నిర్ణయించుకున్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు

పెద్దపల్లి రూరల్ , ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మహిళల రక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చాయని షీ టీం ఇంఛార్జి ఎస్ఐ లావణ్య అన్నారు. మంగళవారం రాఘవపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. షీ టీం సభ్యురాలు స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత, అన్‌లైన్ మోసాల పై, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. షీ టీం సభ్యురాలు మౌనిక, సురేష్, హెడ్ మాస్టర్ హన్మంతు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పైప్ లైన్ల లీకేజీలను పరిశీలించిన కమిషనర్

సుల్తానాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణ ప్రజలకు మంచినీటి సరఫరా చేసే పైప్‌లైను మరమ్మతు పనులను కమిషనర్ మహ్మద్ నియాజ్ పరిశీలించారు. తరుచుగా పైప్‌లైన్లు లీకేజీలు ఏర్పడి మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని వీటిని మరమ్మతు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంగళవారం గట్టేపల్లి మానేరు వాగులోని పైప్‌లైన్ మోటార్ల పని తీరు, బావులను పరిశీలించారు. గట్టేపల్లి నుంచి పైప్‌లైన్ల ద్వారా సుల్తానాబాద్ పట్టణంలోని అశోక్‌నగర్‌లోని మంచినీటి బావికి మానేరు నీరు చేరి స్టోరేజీ చేస్తున్నామని అక్కడి నుంచి వివిధ ట్యాంకులకు నీటిని పంపిస్తున్నామని చెప్పారు. అయితే పాత పైప్‌లైన్లు కావడంతో తరుచుగా లీకేజీలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఎలాంటి అంతరాయాలు లేకుండా వాటర్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గట్టేపల్లి బావిలో మోటార్లు కాలిపోవడంతో కొత్తవి బిగించి నీటి సరఫరా పునఃరుద్ధరించామన్నారు.

కల్యాణ మండపానికి నిధులు కేటాయించాలి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సుల్తానా బాద్ మండలంలోని కనుకులలో కల్యాణ మండపం నిర్మించేందుకు నిధులు కేటాయించాలని సింగిల్ విండో వైస్ చైర్మన్ కొమ్మిడి వెంకటరమణారెడ్డి తదితరులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కోరారు. కరీంనగర్‌లో మంత్రిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజే శారు. కనుకుల సహకార సంఘం పరిధిలో స్వంత స్థలం ఉందని, కనుకుల తొగర్రాయి, మంచిరామి, రాముని‌పల్లి మారుతినగర్ తదితర గ్రామాల ప్రజలకు ఉపయోగపడేలా కల్యాణ మండపం నిర్మించుకోవాలని నిర్ణయించామన్నారు. ఎంపీ నిధులు కేటాయించాలని వారు వినతిపత్రంలో కోరారు. నాయకులు వడ్లకొండ శశివర్ధన్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ

సుల్తానాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పదో తర గతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు యువ సం కల్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. మంగళవారం శాస్త్రినగర్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల విద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈవో రాజయ్య చేతుల మీదుగా అందించారు.

తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలి




కార్డులు పోస్టు చేస్తున్న ఉద్యమకారుల ఫోరం నాయకులు

రామగిరి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో క్రియ శీలంగా పాల్గొని స్వరాష్ట్రం సాధించే వరకు కృషి చేసిన తమకు ప్రయో జనాలు కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి మంగళవారం పోస్టుకార్డులు వేశారు. ఇంటి స్థలాలు, పెన్షన్, కల్పించాలని ఉద్యమ ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్ ఆదేశాల మేరకు సెంటినరీకాలనీలో మహిళ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పొతుజ్యోతిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనెరాజేశం, రాష్ట్ర కార్యదర్శి కళాధర్‌రెడ్డి, బత్తుల శంకర్, జిల్లా అధ్యక్షుడుసిరివెరి సుధాకర్ పాల్గొన్నారు.


మంథని,(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తా మని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి హామీని నిలుపుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు కాసిపేట సాంబయ్య కోరారు. ఈమేరకు సీఎంకు మంగళవారం పోస్టు కార్డులు పంపారు. ఇండ్ల స్థలాలు, నిర్మాణానికి రూ.10 లక్షలు, ఫ్రీ బస్సు, రైల్వే పాసు, పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. మంథని విజయ్‌కుమార్, గుర్రం దేవేందర్, జాడి జంపయ్య, మిరియాల రాంరెడ్డి, గోగుల రాజిరెడ్డి, మబ్బు ఓదమ్మ, బండారి సుధాకర్, మల్యాల శంకర్, తోకల మల్లేష్, మంథని సంపత్ ముస్కే. ఈశ్వరమ్మ, బర్ల నరేష్‌లు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు స్వాగతం

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి వెళుతున్న మంత్రి శ్రీధర్‌బాబుకు మంగళవారం గోదావరిఖనిలోని మున్సిపల్ టీ జంక్షన్ వద్ద ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. బెల్లంపల్లిలోని పట్టభద్రుల సమావేశానికి వెళుతున్న శ్రీధర్‌బాబుకు నాయకులు ఘన స్వాగతం పలికారు.



హిందుస్థాన్ జింక్ ఉద్యోగులకు రెస్క్యూ శిక్షణ




హిందుస్థాన్ జింక్ ఉద్యోగులతో రెస్క్యూ జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లోని హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ కంపెనీకి చెందిన 14 మంది ఉద్యోగులకు రెస్క్యూ శిక్షణా తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆర్జీ-2 ఏరియాలోని రెస్క్యూ ప్రధాన స్టేషన్‌లో రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి రెస్క్యూ అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తూ దేశంలోనే పేరుగడించిందని, ఇతర ప్రభుత్వ, ప్రైవేట్ మైనింగ్ సంస్థలకు శిక్షణ ఇస్తున్నట్లు జీఎం పేర్కొన్నారు. 15 రోజుల పాటు జరిగే శిక్షణలో మైనింగ్‌లో జరిగే ప్రమాదాలపై అవగాహన, చిక్కుకున్న వారిని రక్షించడం వంటి అంశాలపై శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. శిక్షణకు వచ్చిన 14 మందిలో ఏడుగురు మహిళలు ఉన్నారు. రెస్క్యూ సూపరెండెంట్ మాధవరావు, ఇన్‌స్ట్రక్టర్లు భాస్కర్‌రెడ్డి, ఏఎస్ మూర్తి, బ్రిగేడియర్లు పాల్గొన్నారు.

వికసిత భారత్ లక్ష్యంలో మైనింగ్ రంగానికి కీలక పాత్ర

గోదావరిఖని, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడంలో మైనింగ్ రంగం పాత్ర కీలకమని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం అన్నారు. మైనింగ్ ఇం జినీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా హైద రాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో 'ఖనిజ అన్వేషణ - ఆత్మనిర్భర్ వికసిత భారత్-2047 వైపు ముందడుగు' అనే అంశంపై హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సు ము గింపు సమావేశంలో సీఎండీ మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రోత్సాహంతో క్రిటికల్ మినరల్స్ అన్వేష ణలో ఉన్న అవకాశాలపై సింగరేణి ఆధ్వ ర్యంలో అధ్యయనానికి చర్యలు తీసుకుంటు న్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మైనింగ్ రంగంలో సంస్కరణలు తీసుకురావడం, బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించడంపై దృష్టి సారిస్తుందన్నారు. లిథియం, కోబాల్ట్, నికెల్ తదితర ఖనిజాల అన్వేషణ చేపట్టడం ద్వారా భవిష్యత్ టెక్నాలజీ అభివృద్ధికి దోహ దపడిన వాళ్లమవుతామన్నారు. ముఖ్యంగా దేశాన్ని 2070 నాటికి నెట్ జీరోగా మార్చా లన్న లక్ష్యాన్ని చేరుకోవడానికి ఈ అరుదైన ఖనిజాల అక్రమ మైనింగ్‌ను నిరోధించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడవచ్చన్నారు. సదస్సులో ఎన్ఎం డీసీ డైరెక్టర్ (కమర్షియల్) వీ సురేశ్, డైరెక్టర్ (టెక్నికల్), ఎంఈఏఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ వినయ్ కుమార్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బీ విశ్వనాథ్, సలహాదారు ఏకే శుక్లా, విశ్రాంత డైరెక్టర్ సత్పతి, ఎస్ఎల్ఈ విశ్రాంత సీఎండీ సురేంద్ర మోహన్ మాట్లా డారు. సింగరేణి జీఎం(కో ఆర్డినేషన్) ఎస్‌డీ ఎంసుభాని, ఎంఈఏఐ సభ్యులు, మైనింగ్ రంగ నిపుణులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాం

సింగరేణి పాఠశాలను సందర్శించిన జీఎం సెక్రెటరీ

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సెక్టార్-3 సింగరేణి పాఠశాలను ఎడ్యు కేషన్ సెక్రెటరీ గుండా శ్రీనివాస్ మంగళవారం సందర్శించారు. పాఠశాల స్థితిగతులు, సిబ్బం ది వివరాలు తెలుసుకుని వసతులను పరిశీ లించారు. ఉపాధ్యాయ బృందంతో ఆయన సమావేశమయ్యారు. 10వ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగ తులు నిర్వహించడం, వెనకబడిన విద్యార్థులు రాణించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచిం చారు. విద్యార్థులు పరీక్షల ఒత్తిడి గురికాకుం డా సిద్ధం చేయాలని సూచించారు. ఆర్జీ-2 జీఎం కలిశారు. అనిల్‌కుమార్, సుందర్‌రావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో సమావేశమైన శ్రీనివాస్